క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన

పాములపాడు: మండలంలోని లింగాల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 200 రోజుల పనిదినాలు కల్పించాల్సి ఉందన్నారు. గ్రామంలో రైతులు, కూలీల కోరిక మేరకు పొలాల్లో నీటిని కట్టుకోవడానికి సౌకర్యంగా ఫీల్డ్ చానల్స్ పనులు చేపట్టినట్లు తెలిపారు. కూలీల అటెండెన్స్, మస్టర్‌లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. 176 మంది వేతనదారులు పనులకు హాజరైనట్లు పేర్కొన్నారు.

నాటుసారా స్వాధీనం

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని బ్రాహ్మకొట్కూరు ఎస్ఐ తిరుపాలు హెచ్చరించారు. బుధవారం 10 బొల్లవరం వద్ద నాటుసారా అమ్ముతునట్లు సమాచారం రావడంతో 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకోగా.. నీలిషికారి సురేష్ పారిపోయాడు. పరారీలో ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సారా పట్టివేత

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీసుస్టేషన్ పరిధిలోని పడమర ప్రాతకోట కేసీ కాల్వ వద్ద నాటుసారా విక్రయిస్తున్న నీలిషికారి ఖాలియా ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. నిందితుడి నుంచి పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసునమోదు చేశామన్నారు. అనంతరం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి నిందితుడిని రిమాండ్‌కు ఆదేశించారని ఎస్ఐ వివరించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మిడుతూరు: మండలంలోని అలగనూరు, రోళ్లపాడు గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు బుధవారం తెలిపారు. రోళ్లపాడు గ్రామానికి చెందిన కాటిపోగు ఎల్లయ్య గ్రామంలో మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడి చేసి అతని నుంచి 31 బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా అలగనూరు గ్రా మంలో నాగేంద్ర గౌడ్ మద్యం విక్రయిస్తుండ గా 11 బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమో దు చేసినట్లు వెల్లడించారు. ఏఎస్ఐలు సుబ్బ య్య, హరి ప్రసాదు, సిబ్బంది పాల్గొన్నారు.

1న పింఛన్ల పంపిణీ

జూపాడుబంగ్లా: నవంబర్ మాసానికి సంబంధించిన పింఛన్ల నగదు డ్రా చేసినట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా నవంబర్ మాసానికి గాను 4,974 పింఛన్లకు గాను రూ.2,09,26,000 నగదు మంజూరైందన్నారు. 31న సెలవు దినం కావటంతో పింఛన్ల నగదును డ్రాచేసి పంపిణీ దారులకు అప్పగించినట్లు తెలిపారు. నవంబర్ ఒకటోవ తేదీన ఉదయం ఐదు గంటల నుంచే లబ్ధిదారులకు పింఛన్ మొత్తం పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

ఎన్‌పీసీఐ చేయించుకోండి..

18ఏళ్లు పైబడిన వారందరూ నేషనల్ పేమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) లింకప్ చేయించుకోవాలని ఎంపీడీఓ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు ఆపైన వయస్సున్న వారందరూ వారి బ్యాంకు ఖాతాతో ఆధార్ నంబర్, సెల్‌ఫోన్ నంబర్ లింకప్ చేయించుకోవాలన్నారు. మండలం వ్యాప్తంగా 12 గ్రామ పంచాయతీల్లో 2,974 మంది ఇంకా ఎన్‌పీసీఐ చేయించుకోవాల్సి ఉందన్నారు. వారందరూ నవంబర్ 15వ తేదీలోగా గ్రామాల్లోని సచివాలయాల్లో ఎన్‌పీసీఐ చేయించుకోవాలని సూచించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కొత్తపల్లి: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు కే. దినేష్ కుమార్, జిల్లా నాయకుడు సాయి ప్రశాంత్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ గోకవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకుకి ప్రహరీ ఏర్పాటు చేయాలని, ఎదురుపాడు ఎంపీపీ స్కూల్‌కి సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినా విద్యార్థులకు ఇచ్చిన హామీలను పట్టించుకోలేదన్నారు. తల్లికి వందనం, ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత లేదన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి జూనియర్ అసిస్టెంట్ సాయికి వినతి పత్రం అందజేశారు. అంజి బాబు, కిరణ్, బాలాజీ, దిలీప్, విద్యార్థులుపాల్గొన్నారు.

ప్రజలకు చేసిన సేవలే గుర్తింపునిస్తాయి



ఆర్టీసీ డీఎం మహేంద్రుడిని సన్మానిస్తున్న ఉద్యోగులు

ఆత్మకూరు: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని, అయితే పని చేసిన చోట ప్రజలకు చేసిన మంచి సేవలే గుర్తింపునిస్తాయని ఆర్టీసీ డిపో సీఐ బీకే నాయక్ అన్నారు. డిపోలో బుధవారం డీఎం మహేంద్రుడు పదవీ విరమణ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉద్యోగులకు పదవీ విరమణ సాధారణమన్నారు. ఆర్టీసీ డిపో అభివృద్ధికి మహేంద్రుడు ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం మహేంద్రుడు మాట్లాడుతూ ప్రతి కార్మికుడి సహాయ సహకారాలు మరువలేనివన్నారు. అనంతరం డీఎం దంపతులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

● **ఆత్మకూరురూరల్:** ఆర్‌డీఓ మిరియాల దాసు సేవలు కొనియాడదగినవని పలువురు ప్రశంసించారు. స్థానిక కొండా గార్డెన్‌లో బుధవారం ఆర్‌డీఓ దాసు ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. దాసును నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, నెల్లూరు డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ రత్నరాధిక, రెవెన్యూ ఉద్యోగ సంఘ నాయకులు తదితరులు ఘనంగా సన్మానించారు.

● **మహానంది:** తిమ్మాపురం పశువైద్య కేంద్రంలో ఆఫీసు సబార్డినేట్ మూడే వేమానాయక్ పదవీ విరమణ సందర్భంగా ఆయనను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గోవిందనాయక్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, వైద్యాధికారి కరుణాకర్, తమ్మడపల్లె పశువైద్య కేంద్రం వీఎల్ఓ సులోచన తదితరులు పాల్గొని వేమానాయక్‌ను సన్మానించారు.

టపాసుల దుకాణాలు కిటకిట





హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలు, జనంతో నిండిపోయిన దుకాణాలు

నందికొట్కూరు: చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దీపావళి పండుగను జరుపుకుంటారు. సాధారణంగా పండుగ సంబరాలు మూడు రోజుల ముందుగానే ప్రారంభమవుతాయి. ముఖ్యంగా టపాసులు కాల్చడంపై యువత మొగ్గు చూపుతుంది. నందికొట్కూరు మున్సిపల్ పరిధిలో మొత్తం 11 బాణాసంచా దుకాణాలకు దరఖాస్తులు చేసుకోగా రెవెన్యూ అధికారులు బుధవారం అనుమతులిచ్చారు. దీంతో ఉన్నత పాఠశాల మైదానంలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేశారు. కాగా దుకాణాల మధ్య దూరం పాటించకపోవడం, వాహనాలను దుకాణాల వద్దనే నిలపడం, ప్రమాదాల నిరోధక చర్యలు అంతంత మాత్రంగానే ఉండటంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

‘అలగనూరు’కు మరమ్మతులు చేపట్టండి



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

మిడుతూరు: అలగనూరు రిజర్వాయర్‌కు త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అలగనూరు రిజర్వాయర్‌ను సీపీఐ ప్రతినిధి బృందం పరిశీలించింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్ ఉన్న ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం కారణంగా రూ.3 కోట్లతో పూర్తి చేయాల్సిన గండిని నేడు రూ.50 కోట్లు కేటాయించినా పూర్తి చేయలేని స్థితి నెలకొందన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాబా ఫక్రుద్దీన్, కార్యవర్గ సభ్యులు రాఘురామమూర్తి ఎం.రమేష్ బాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కురవలు ఏకతాటిపై నిలవాలి

● కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

శ్రీశైలం: కురవ కులస్తులు ఏకతాటిపై నిలబడాలని కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు సూచించారు. శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్ల దర్శనార్థమైన వచ్చిన ఆయన బుధవారం సాయంత్రం శ్రీశైలం క్షేత్రపరిధిలోని బీరప్పసదన్(కురువ కుల సత్రం)ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో ఉన్న కురవ కులస్తులంతా కలిసి ఏళ్ల క్రితం బీరప్ప సదన్‌ను నిర్మించారన్నారు. తెలుగు రాష్ట్రాలు విడిపోయాక సత్రం నిర్వహణపై సమస్యలు తలెత్తాయన్నారు. రాష్ట్రం విడిపోయినంత మాత్రాన కులస్తులంతా వేరు కాదని, అందరూ సమన్వయంగా బీరప్ప సదన్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో అఖిల భారత కురవ వంశ నిత్య అన్నదాన సత్రం చైర్మన్ ఎం.కె.రంగస్వామి, ఉపాధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పటేల్ సేవలు ఎనలేనివి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రవీంద్రనాథరెడ్డి

నందికొట్కూరు: సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉప ప్రధానమంత్రిగా, హోంమంత్రిగా అందించిన సేవలు మరవలేనివని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రవీంద్రనాథరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు డాక్టర్ ఆర్ రఘుపతి, అన్వర్ హుసేన్, ఖాజా హుసేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ సభలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్

బండి ఆత్మకూరు: గ్రామ సభలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ థోని ఆల్ ఫ్రైడ్ సూచించారు. మండల పరిధిలోని పరమటూరు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో 145 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. పట్టాదారు పేరు మార్పు కోసం 11, జాయింట్ ఎల్‌పీఎంల సబ్‌డివిజన్ కోసం 25, విస్తీర్ణం మార్పు కోసం 56 కలిసి మొత్తం 92 అర్జీలను రైతులు అధికారులకు సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విరాట్ సిద్దార్థ్, మండల సర్వేయర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాగుపాము కలకలం



నాగుపామును పట్టుకున్న మోహన్

మహానంది: గాజులపల్లెలోని ఓ చికెన్ సెంటర్లో బుధవారం నాగుపాము కలకలం రేపింది. బ్రాయిలర్ కోళ్లను డ్రెస్సింగ్ చేసే ప్రాంతంలో నాగుపాము కనిపించడంతో నిర్వాహకులు భయాందోళనకు గురయ్యారు. వారు అయన్ననగర్ గ్రామానికి చెందిన మోహన్‌కు సమా చారం అందించగా అతడు అక్కడికి చేరుకుని పామును పట్టుకుని సమీపంలోని అడవిలో వదిలేశాడు.

గందరగోళంగా ఉపాధి గ్రామ సభ



తనిఖీ వివరాలను వెల్లడిస్తున్న డీఆర్‌పీ సరేంద్ర

పగిడ్యాల: స్థానిక గ్రామ సచివాలయ–1లో బుధవారం గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభ గందరగోళంగా సాగింది. ఉపాధి హామీ పనుల వివరాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండల వ్యాప్తంగా 8 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై 18వ విడుత సామాజిక తనిఖీ బృందం ఈనెల 25వ తేదీ నుంచి భౌతిక పరిశీలన చేసి గ్రామసభ నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం సక్రమంగా విచారణ చేపట్టలేదని గ్రామానికి చెందిన రాజేష్, రాముడుతో పాటు మరికొందరు ఆక్షేపించారు. దీంతో పరస్పర ప్రత్యారోపణలతో సభ గందరగోళంగా మారింది. నవంబర్ 5న బహిరంగ సమావేశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఏపీఓ మద్దిలేటి, ఎస్ఆర్‌పీ మురాద్, సాంకేతిక సహాయకులు(ఈసీ) అశోక్ పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేద్దాం

– ఈఓ ఎన్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న ఈఓ ఎన్.శ్రీనివాసరెడ్డి

మహానంది: కార్తీకమాసం ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిద్దామని మహానంది ఆలయ ఈఓ ఎన్ శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. కార్తీకమాసం ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశంలో అయన మాట్లాడారు. కార్తీకమాసం ముఖ్య రోజుల్లో తెల్లవారుజామున 4.30 నుంచి ఉదయం 8 గంటల వరకు క్యూలైన్లలోని భక్తులకు పాలు పంపిణీ చేయాలన్నారు. ప్రతి ఆది, సోమవారాల్లో భక్తులకు ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్నప్రసాద వితరణ చేయాలన్నారు. ఆలయ పరిసరాల్లో డస్ట్ బిన్‌లు, వాహనాల పార్కింగ్, విద్యుత్ అంతరాయం లేకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్, ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. సమావేశంలో ఏఈఓ వై.మధు, ఆలయ పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, సీఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

పగిడ్యాల: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుమిత్రమ్మను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్లు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులు శాలుబాషా, హమీద్, బడేసాబ్ ఉన్నారు.

జిగురు అట్టలతో వరిలో దోమ నివారణ

పాములపాడు: వరి పైరులో తెల్ల దోమ, పచ్చ దోమ నివారణకు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా వనరుల వ్యవసాయ అధికారిణి హేమలత, మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని రుద్రవరం, మిట్టకందాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి రైతులతో మాట్లాడారు. వరిలో కాండం తొలుచు, ఆకుముడత పురుగు నివారణకు ఎరటాఫ్ హైడ్రో క్లోరైడ్ 4జి పౌడర్‌ను రెండు గ్రాముల లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పంటలు సాగు చేసిన రైతులు పంటల బీమా చేయించుకోవాలని తెలిపారు. వీఏఏ షబ్బీర్, మనీష, ఎంపీఈఓ మునోషర్ పాల్గొన్నారు.

నందికొట్కూరు: మండలంలోని మల్యాల గ్రామ పొలిమేరలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి షేక్షావలి వరి పంటను పరిశీలించారు. గ్రామ సర్పంచు, ఎంపీటీసీ, ఆబీకేలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మహానందీశుడి దంపతులకు కల్యాణం

మహానంది: మహానందీశ్వరుడి దంపతుల కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. యాగశాలలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, వేదపండితులు నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతు శర్మ ఆధ్వర్యంలో మాంగళ్య ధారణ, అక్షింతల సమర్పణ పూజలను నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు.

మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలి

పాములపాడు: పొదుపు గ్రూపుల్లో ఉన్న ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ధ్యేయంగా పని చేయాలని ఏపీఎం ఉమా మహేశ్వరమ్మ తెలిపారు. బుధవారం స్థానిక ధనలక్ష్మి మండల మహిళా సమాఖ్య భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మహిళలు రుణం పొందటం, సక్రమంగా చెల్లించడంతో పాటు కుటుంబ అభివృద్ధి కోసం కుటీర పరిశ్రమలు నెలకొల్పుకోవాలని సూచించారు. అనంతరం ఆఫీస్ బేరర్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల ప్రెసిడెంట్‌గా పుష్పావతి (పాములపాడు), వైస్ ప్రెసిడెంట్ సుమలత(లింగాల), సెక్రెటరీ గీత(ఇస్కాల) జాయింట్ సెక్రెటరీ రమాదేవి(మిట్టకందాల) ట్రెజరర్ గౌసియా(మద్దూరు)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాత కమిటీ సభ్యులను సత్కరించారు.

వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి



దుర్గా చరణ్‌ను సన్మానిస్తున్న అధికారులు

కొత్తపల్లి: పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.ఆంజనేయ తెలిపారు. బుధవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి మహేష్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సాగు పద్ధతులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మినుము విత్తనం వేసేటప్పుడు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని, ప్రత్యక్షంగా విత్తనశుద్ధి చేసి చూపించారు. అలాగే కొత్తపల్లి గ్రామ వ్యవసాయ సహాయకుడిగా పనిచేసిన దుర్గాచరణ్ పదోన్నతిపై పాములపాడు మండల వ్యవసాయ విస్తరణ అధికారిగా బదిలీ కావడంతో ఆయనను సన్మానించారు.

దొంగను పట్టించిన సీసీ కెమెరాలు

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థమై వచ్చిన భక్తుల సెల్‌ఫోన్ చోరీకి గురికాగా సీసీ కెమెరాల ఆధారంగా గంటల్లోపే దొంగను పట్టుకున్న ఘటన మహానందిలో బుధవారం చోటు చేసుకుంది. ఒంగోలుకు చెందిన మాధవి కుటుంబ సభ్యులతో మహానందీశ్వర స్వామి దర్శనార్థం వచ్చారు. స్థానిక సుపథ మండపాల్లో నిద్రిస్తుండగా తెల్లవారుజామున ఓ దొంగ సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లాడు. ఉదయం గుర్తించిన వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హోంగార్డు బాలుడు సీసీ కెమెరాల ద్వారా దొంగను గుర్తించి పట్టుకుని ఫోన్ బాధితురాలికి అప్పగించారు.